# పెళ్లి చూపులు

రిక్షా ఆగిన శబ్దం విని "పెళ్లివారు వచ్చినట్లుంది" అంది కూతురు జడకు మొగలిరేకులు అల్లుతున్న రుక్మిణమ్మ.

పంచె సరిచేసుకుంటూ ఆదరాబాదరాగా లేచాడు కోదండరామయ్య.

రిక్షావాడికి డబ్బులిచ్చి వాళ్ళను సాదరంగా లోపలకాహ్వానించాడు.

ఆరోజు పెళ్లివారు వస్తారని కుర్చీలు సర్ది హాలంతా మనోజ్ఞంగా తీర్చి దిద్దాడు కోదండ రామయ్యగారి కొడుకు కిరణ్.

"మీ అమ్మాయికి చాకులాంటి కుర్రాణ్ణి పట్టుకొచ్చాను. నచ్చకోడాలైతే లగ్నాలు పెట్టేసుకోవడమే" అన్నాడు పేరయ్య వాలుకుర్చీలో ఆశీనుడై నశ్యం పీలుస్తూ.

కోదండరామయ్య ముఖం వెయ్యి వోల్టుల విద్యుత్ బల్బులా వెలిగిపోయింది. ఆయన మాటల్ని బట్టి చూస్తే వరుడికి కట్నం మీద ఆశలేనట్లుంది అనుకున్నాడు లోలోన.

నోరూరించే ఫలహారాలు ప్రత్యక్షమయ్యాయి.

మొహమాట పడకుండా సుష్టుగా భోంచేశారు పెళ్లివారు.

పిల్లను చూడటం, ప్రశ్నలడగటం లాంటి పెళ్ళి చూపుల తతంగం పూర్తి అయింది.

అమ్మాయిని లోపలకు తీసుకెళ్లింది రుక్మిణమ్మ.

కోదండరామయ్యను ప్రక్కకు పిలిచి "అబ్బాయి అమ్మాయిని నచ్చినట్లుగా కనిపిస్తోంది అతడి ఉద్దేశం కనుక్కొని మీకు కబురంపుతాను. పైసా కట్నం లేకుండా ఈ పెళ్లి చేయించే పూచీనాది" అభయమిచ్చాడు పేరయ్య.

ఆయన మాటలకు ఉప్పొంగిపోయాడు కోదండ రామయ్య ఇక రుక్మిణమ్మ సంగతి సరేసరి. పెళ్ళై పోయినట్లుగానే సంబరపడి పోయింది.

"పొరుగూరిలో చిన్న పనుంది. ఈ రాత్రికి మీ ఇంట్లోనే బసచేసి రేపు వెళదామనుకుంటున్నాను. మీకేమైనా అభ్యంతరమా?" ఆ మాట ఈ మాట అయ్యాక అడిగాడు పేరయ్య.

"ఎంత మాట? మీరుండాలేగాని అది నా అదృష్టంగా భావించనూ?" ముక్కు మీద వేలేసుకుంటూ అన్నాడు కోదండరామయ్య.

మధ్యాహ్నం భోజనానంతరం విశ్రమించి చల్లబడ్డాక వీధిలోకి బయలుదేరాడు పేరయ్య.

ఆ ఊళ్ళో పెళ్ళికొడుకు దిగాడన్న వాసన పసిగట్టిన మరో ఆడపిల్ల తండ్రి తన అదృష్టాన్ని పరీక్షించుకోడానికి ప్రయత్నించాడు.

"ఒకనాడే అందరిళ్ళకు వెళితే ఏం ప్రయోజనం" అనుకుంటూ "అమ్మాయిని చూడటానికి వారం వర్జ్యం అంత బాగోలేవు రేపొస్తాం" అన్నాడు పేరయ్య.

"ఈ రోజు పాడ్యమి బుధవారం దివ్యంగా వుందే" అంటూ అవతల వ్యక్తి సందేహం వెలిబుచ్చాడు.

"అన్నీ బాగానే వున్నాయి మరి దుర్ముహూర్తం మాటేమిటి? అది నెత్తిమీద కొచ్చి కూర్చుంది" అన్నాడు పేరయ్య ముఖం చిట్లిస్తూ.

"సరే మీ అభీష్టం మేరకు రేపే మా ఇంటికి దయచేయండి" ఆహ్వానించి వెళ్ళిపోయాడు ఆ పెద్ద మనిషి.

పెళ్ళి చూపులు జరిగి నెల రోజులైనా పేరయ్య వద్ద నుండి ఏ కబురూ లేకపోవడంతో అబ్బాయి పిల్లని నచ్చుకోలేదేమోననుకున్నాడు కోదండరామయ్య.

పేరయ్య ఆధ్వర్యంలో పెళ్ళి చూపులు పేరుతో సుమారు వందమంది అమ్మాయిల ముఖారవిందాలను తిలకించి వుంటాడు మన అభినవ వరుడు సుధీర్. ఇప్పుడతడు మూడోపదిలో పడ్డాడు.

"మనం ఎప్పుడో ఈ ఇంట్లోకి వచ్చినట్లు గుర్తు" అన్నాడు పేరయ్య వెంట ఫ్రెష్‌గా పెళ్ళి చూపులకు బయలుదేరిన సుధీర్.

"మనం లక్ష గడపలు ఎక్కి దిగడం వలన నీకలా అనిపిస్తుంది. నోరు మూసుకుని లోపలకు పద" ముందుకు నెట్టాడు పేరయ్య.

ఐదు సంవత్సరాల క్రితం అమ్మాయిని చూసి వెళ్ళిన పెళ్ళి కొడుకు మళ్ళీ పెళ్ళి చూపుల పేరుతో తన ఇంట్లో కాలు పెట్టేసరికి అరికాలు మంట నెత్తికెక్కింది కోదండరామయ్యకి.

"ఏంరా అమ్మాయిల్ని చూడటం, వాళ్ళ జీవితాలతో ఆటలాడుకోవడం నీ హాబీయా?" అంటూ సుధీర్ పీల్టు పట్టుకుని నాలుగు వడ్డించే మూడ్‌లో కొచ్చాడు కోదండరామయ్య కొడుకు కిరణ్.

బిక్క చచ్చిపోయాడు సుధీర్.

జరిగిన పొరపాటు అర్థమయింది పేరయ్యకు అతడిపై ప్రాణాలు పైకిపోయాయి.

మరి కొద్దిసేపట్లో తనకు కూడా దేహశుద్ధి తప్పదని గ్రహించిన పేరయ్య "క్షమించండి నేను పెళ్లిళ్ళ పేరయ్యను కాను. పట్టభద్రుడైనా పట్టెడన్నం సంపాదించుకోలేని ఈ నిర్భాగ్యుడి తండ్రిని వాడి చదువుకోసం ఉన్న దంతా వూడ్చిపెట్టాను. పూట గడవడం గగనమై పోవడంతో ఈ నాటకం ఆడవలసి వస్తోంది. పెళ్లి చూపుల మిషతో ప్రతిరోజు రకరకాల శాకపాకాలను రుచిచూస్తూ కాలం గడిపేస్తున్నాం. మమ్మల్ని మన్నించి విడిచి పెట్టండి. మాకు బుద్ధొచ్చింది." అంటూ చెవులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు.

"యూ స్కౌండ్రల్" సుధీర్‌ని వదలి పేరయ్య మీదకురికాడు కిరణ్ ఉగ్రరూపం దాల్చి.

"ఆగరా కిరణ్ తొందరపడకు. చచ్చిన పామును కొట్టడం గొప్ప అనిపించుకోదు. మనదేశంలో నిరుద్యోగం ఎంత తీవ్రస్థాయికి చేరుకుందో తెలియజేయడానికి ఇదొక ప్రత్యక్ష నిదర్శనం. కూటికోసం కోటి విద్యలన్నట్లు వీళ్లీ మార్గాన్ని ఎన్నుకున్నారు. ఇకపోతే కొద్దో గొప్పో కట్నం పారేసి పెళ్లి చేద్దామన్నా ఆడ పిల్లకు వరుడు దొరకడం లేదు. పెళ్లి చేసుకోవాలనుకుంటున్న మగవాడికి ఉపాధి లేకపోవడంతో బ్రహ్మచారిగా వుండిపోతున్నాడు. ఇక ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయ్యేదెలా? ఇదీ ఈనాటి వింత వివాహవ్యవస్థ. "చూడు సుధీర్ నిజంగా నీకు పెళ్లి చేసుకోవాలని వుంటే చెప్పు ఇప్పుడైనా నా కూతుర్ని నీకివ్వడానికి సిద్ధంగా వున్నాను" అంటూ వరుడిపై సానుభూతి కురిపించాడు కోదండరామయ్య.

"నాకింకా..." ఏదో అనబోయాడు సుధీర్.

"ఉద్యోగమవకపోయినా ఫరవాలేదు. మా అమ్మాయి సంపాదిస్తోంది" అన్నాడు అతడి ఉద్దేశాన్ని గ్రహించిన కోదండరామయ్య.

నాకంత అదృష్టమా అన్నట్లుగా చూశాడు సుధీర్

● ఆంధ్రప్రభ ఆదివారం *26.4.89* ●